సాక్షి విశాఖపట్నం

సోమవారం : 25 : డిసెంబర్ : 2023



రికార్డు కోసం.. సాధన చేసి..

విభిన్న రంగాల్లో రికార్డులతో ఖ్యాతిగాంచిన విశాఖ నగరం సరికొత్త రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. 8లో



శీతాకాలపు అతిథులు

చలికాలంలో ఉన్ని దుస్తులు విక్రయించేందుకు టిబెటన్ శరణార్థులు విశాఖపట్నం చేరుకుంటారు. 8లో

ఆధ్యాత్మికత వారధి.. టీటీడీ డైరీ



ఆధ్యాత్మికతకు, హిందూ సంప్రదాయానికి వారథిగా తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలు నిలుస్తున్నాయి. ప్రస్తుతం అందరికీ ఈ డైరీలు అందుబాటులోకి వచ్చాయి. 8లో

న్యూస్‌రీల్

జూకి రూ 8.86 లక్షల ఆదాయం



జూలో నీటి ఏనుగును చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. అధిక సంఖ్యలో సందర్శకులు సందర్శించారు. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. మొత్తం 9,723 మంది సందర్శించగా.. రూ 8.86 లక్షలు ఆదాయం చేకూరినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. గత ఆదివారం 8,550 మంది ద్వారా రూ 6.84 లక్షలు ఆదాయం లభించిన విషయం తెలిసిందే.

రోలర్ స్కేటింగ్‌లో అన్నదమ్ములకు పతకాలు



బంగారు పతకాలు సాధించిన అన్నదమ్ములు

సీతమ్మధార : చండీగఢ్‌లో ఈనెలలో జరిగిన 61వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2023లో రేసపువానిపాలెంకు చెందిన అన్నదమ్ములు బంగారు పతకాలు సాధించారు. జాతీయ స్థాయి సీనియర్ మెన్ కేటగిరీ ఇన్‌లైన్ ఆల్ఫైన్ ఈవెంట్‌లో చందక వెంకట పవన్ కార్తికేయ బంగారు పతకంతో పాటు డౌన్ హిల్ ఈవెంట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. చందక వెంకట నాగమురారి జాతీయ జూనియర్ మెన్ కేటగిరీలో ఇన్‌లైన్ ఆల్ఫైన్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు.

మరో 11 మందికి కరోనా

మహారాణిపేట: మరో 11 మందికి కరోనా సోకింది. దీంతో కేసుల సంఖ్య 18కి చేరుకుంది. ఈ 11 మంది నుంచి నమూనాలు సేకరించి... జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపినట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. గడిచిన 24 గంటల్లో 34 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో 11 మందికి కరోనా నిర్ధారణ అయినట్లు చెప్పారు. కేజీహెచ్ నిర్వహించిన పరీక్షల్లో 8 మందికి, ప్రైవేట్ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. వీరిలో కైలాసపురం, ఆనందపురం, కంచరపాలెం, రామ్‌నగర్, సబ్బవరం, డెంకాడ(విజయనగరం), శ్రీకాకుళం, అనపర్తికి చెందిన ఒక్కొక్కరు, అనకాపల్లికి చెందిన ముగ్గురు ఉన్నారు.


ముగ్గురిని కాపాడిన లైఫ్ గార్డ్స్



ముగ్గురిని ఒడ్డుకు చేర్చిన లైఫ్ గార్డ్స్

పెదగంట్యాడ : యారాడ తీరంలో సరదాగా గడుపుదామని వెళ్లిన తల్లి, కుమార్తె, కుమారుడు సముద్రంలో కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. స్థానిక సమతానగర్‌కు చెందిన మర్రి శ్రావణి (35), మర్రి హవీషా (10), మర్రి యశ్‌దీప్ (7) ఆదివారం సెలవు కావడంతో బీచ్‌లో సరదాగా గడుపుదామని యారాడ వెళ్లారు. అక్కడ కాసేపు ఇసుక తిన్నెల్లో గడిపిన వారు సముద్రంలో దిగారు. ఒక్కసారిగా అలల తాకిడి ఎక్కువ కావడంతో ముగ్గురూ సముద్రంలోకి కొట్టుపోతుండగా.. అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ కదిరి వెంకటేష్, కదిరి లోవరాజు, సీహెచ్ శ్రీను గమనించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. లైఫ్ గార్డ్స్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు



అనంతగిరి: పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు టూరిస్టులు పోటెత్తారు. శనివారం బొర్రా గుహలను 6వేల మంది పర్యాటకులు సందర్శించగా, రూ.6 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 10వేల మంది సందర్శించగా సుమారు రూ.8 లక్షల వరకు ఆదాయం లభించింది. పర్యాటకుల రాకతో బొర్రాగుహల ప్రాంగణమంతా సందడిగా మారింది. వారం రోజులుగా సందర్శిత ప్రాంతాలన్నీ కళకళలాడతున్నాయి.

ప్రేమ కాంతులు

- నగరానికి క్రిస్మస్ శోభ
- విద్యుత్ ధగధగలతో చర్చిలు, ఇళ్లు
- కిటకిటలాడిన మార్కెట్లు, షాపింగ్‌మాల్స్



జ్ఞానాపురం పునీత పేతురు చర్చి ప్రాంగణంలో క్రిబ్



విద్యుత్ కాంతులీనుతున్న జగదాంబ దగ్గర సెయింట్ ఆంథోని చర్చి



ట్రినిటీ లూథరన్ చర్చి



జగదాంబ దగ్గర సెయింట్ ఆంథోని చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు

దాబాగార్డెన్స్/అల్లిపురం: ఏసుక్రీస్తు జననాన్ని ప్రపంచానికి సూచిస్తూ నక్షత్ర కాంతులు విరజిమ్మాయి. అతని రాకను స్వాగతిస్తూ ప్రార్థన మందిరాలు వెలుగుపూలతో ముస్తాబయ్యాయి. సకల మానవాళికి ప్రేమ, త్యాగం, శాంతి, సోదర సమానత్వాన్ని ప్రబోధించిన ప్రభువు ఏసుక్రీస్తు. అతని మానవ రూపంలో భువిపై అవతరించిన పవిత్రమైన రోజు క్రిస్మస్. సోమవారం క్రిస్మస్ పండగ నేపథ్యంలో వేడుకలకు విశాఖ నగరం సిద్ధమైంది. చర్చిలు, ఇళ్ల క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్, స్టార్ తదితర అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపకాంతులతో కళకళలాడుతున్నాయి. నక్షత్రాల ఆకృతిలో రంగు రంగుల లైట్లతో అలంకరణలు, బహుమతులతో ఆకర్షణీయంగా వేలాడే క్రిస్మస్ చెట్లు, జంగిల్ బెల్స్ అంటూ లయబద్ధంగా కెరోల్ పాటలు.. సంతోషాలను మోసుకొచ్చే శాంతాక్లాజ్.. ఇలా ఎటు చూసినా ఉల్లాసభరితమైన వాతావరణం కనిపిస్తోంది.



బుచ్చిరాజుపాలెంలోని సెయింట్ థామస్ చర్చి



ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న చర్చి



జగదాంబ జంక్షన్ వద్ద క్రిస్మస్ సామగ్రి అమ్మకాలు

సుందరంగా చర్చిలు.. సందడిగా మార్కెట్లు

నగరంలో చర్చిలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. నగరంలో శతాబ్దాల చరిత్ర కలిగిన లండన్ మిషన్ మెమోరియల్ సీఎస్ఐ చర్చి, సెయింట్ ఆంథోనీ చర్చి, సెయింట్ ఆలోసిస్, సెయింట్ జాన్స్, సెయింట్ ప్యారీస్, సెయింట్ పీటర్స్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, క్రైస్ట్ చర్చి ఇలా ఎన్నో చర్చిలు.. కళ్లు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ అలంకరణలతో జిగేల్ మంటున్నాయి. మరోవైపు క్రిస్మస్ షాపింగ్‌తో మార్కెట్లు కిటకిటలాడాయి. వస్త్ర, బంగారం, గిఫ్ట్, క్రిస్మస్ సామగ్రి విక్రయించే షాపులు రద్దీగా దర్శనమిచ్చాయి. క్రిస్మస్ రోజున క్రైస్తవులు కేక్‌లను కట్ చేస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బేకరీ యజమానులు ముందు నుంచే ఆర్డర్లు స్వీకరించారు.

ప్రత్యేక ప్రార్థనలు

నగరంలోని కొన్ని చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పలువురు ఇళ్లల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుకను తెలియపరిచే రీతిలో పశువుల పాకలు, వివిధ ఘట్టాలను అనేక చర్చిల్లో ఏర్పాటు చేశారు. జగదాంబ జంక్షన్‌లోని ట్రినిటీ లూథరన్ చర్చిలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సంధ్యా క్రిస్మస్ ఈవ్ నిర్వహించారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు మొదటి ఆరాధన, 10 గంటలకు రెండవ ఆరాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు, 11 గంటలకు ప్రార్థనలు నిర్వహించనున్నట్లు కల్వరి బాప్టిస్ట్ చర్చి ప్రతినిధులు వెల్లడించారు.

లోకరక్షకుడు ఏసుక్రీస్తు



మహారాణిపేట: జిల్లా ప్రజలకు కలెక్టర్ మల్లికార్జున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు లోకరక్షకుడని, శాంతి దూత అని పేర్కొన్నారు. శత్రువులను మిత్రులుగా మార్చి.. వారు శాంతి మార్గంలో పయనించేలా ప్రేమను చూపారని.. ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. జిల్లాలోని క్రైస్తవులంతా ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజలందరిపై ఏసు ప్రభువు దీవెనలు ఉండాలి



దాబాగార్డెన్స్: నగర ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరి పట్ల ఒకరు ప్రేమ, క్షమ, దయ కలిగి ఉండి.. ఆనందంగా క్రిస్మస్ పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ పండగ రోజున ఏసు ప్రభువు చల్లని దీవెనలు నగర ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

హనుమంతవాక కూడలిలో రూ.40 కోట్లతో ఫ్లై ఓవర్



క్రెడాయ్ ఎక్స్‌పోలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

- త్వరలో సీఎం జగన్‌చే శంకుస్థాపన
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

ఆరిలోవ: హనుమంతవాక కూడలిలో సుమారు రూ.40 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో శంకుస్థాపన చేయనున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి తెలిపారు. ఎంవీపీ కాలనీలో గాదిరాజు ప్యాలస్‌లో రెండు రోజులుగా జరుగుతున్న క్రెడాయ్ ఎక్స్‌పోలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ స్టాళ్లను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో హనుమంతవాక నుంచి ఎన్ఏడీ కూడలి వరకు ఆరు చోట్ల ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం అత్యవసరంగా రద్దీ నియంత్రించే చర్యల్లో భాగంగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో హనుమంతవాక వద్ద ఫ్లై ఓవర్ నిర్మించనున్నామన్నారు. ఆర్కే బీచ్ వద్ద పార్లల్ రోడ్డు నిర్మాణం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విశాఖపట్నం టూరిజం డెస్టినీగా తయారు కాబోతుందన్నారు. విశాఖను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడానికి బిల్డర్ల సహకారం అవసరమన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ విశాఖను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడానికి కృషి జరుగుతోందన్నారు. గ్రీన్ సిటీల్లో ప్రపంచంలోనే విశాఖ రెండో స్థానంలో నిలిచిందన్నారు. మొదటి సిటీగా సింగపూర్ 45 శాతం గ్రీనరీతో ఉండగా, 35 శాతం గ్రీనరీతో విశాఖ నగరం రెండోదిగా నిలిచిందన్నారు. మొదటి స్థానంలో నిలవడానికి బిల్డర్లు, ప్రజలు సహకరించాలన్నారు. లేఅవుట్లు, భవనాల్లో 50 శాతం గ్రీన్ కవరేజీ ఉండాలన్నారు. అపార్టుమెంట్లు టెర్రాస్‌లపై గ్రీనరీ ఉండేటట్లు చూడాలన్నారు. నగరంలో విశాలమైన రోడ్లు, పార్కులు, పిల్లల పార్కులు, స్విమ్మింగ్ పూల్స్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు జీవీ, క్రెడాయ్ ప్రతినిధులు ధర్మేంద్ర వర్మ, రాజేష్ శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



క్రెడాయ్ ఎక్స్‌పో షోలో వినియోగదార్లు, స్టాళ్లు

తాను చనిపోతూ.. ఆరుగురికి పునర్జన్మ

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ బ్రెయిన్‌డెడ్
- పుట్టెడు దుఃఖంలోనూ కుటుంబ సభ్యుల ఔదార్యం
- అవయవదానానికి సంపూర్ణ సహకారం



పూర్ణకుమారి(ఫైల్)

ఆరిలోవ: పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు చూపిన ఔదార్యం ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు ఆ కుటుంబ సభ్యులు. జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం .. అనకాపల్లి జిల్లా గవరపాలెం గ్రామానికి చెందిన వెలమ పూర్ణకుమారి(53) తన కుమారుడుతో ద్విచక్రవాహనంపై ఈనెల 21న విశాఖ వస్తున్నారు. విశాఖ పోర్టు ఫ్లై ఓవర్‌పై వారి ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కిందపడిన పూర్ణకుమారి తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావం జరిగింది. దీంతో ఆమెను రామ్‌నగర్‌లో కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కేర్ ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి తలకు శస్త్రచికిత్స చేశారు. అయినప్పటికీ ఈనెల 23 రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. మంత్రి అమర్‌నాథ్ ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయదానం కోసం ప్రోత్సహించగా అంగీకరించారు. జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుతో మాట్లాడి అవయదాన ప్రక్రియ ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఆమె గుండె, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలు, లివర్ తొలగించి అవసరమైన వారి కోసం తరలించినట్లు డాక్టర్ రాంబాబు తెలిపారు. అవయదానం చేయడానికి ముందుకు వచ్చిన పూర్ణకుమారి కుటుంబ సభ్యులను డాక్టర్ రాంబాబు అభినందించారు. పూర్ణకుమారికి భర్త జగదీశ్వరరావు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బొగ్గు నిల్వలతో పోర్టు హౌస్‌ఫుల్

విశాఖపట్నం పోర్టు.. బొగ్గు నిల్వలతో నిండిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 1.4 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు పేరుకుపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి దిగుమతి చేసుకున్న కోల్ ధరతో పోలిస్తే.. దేశీయ బొగ్గు తక్కువ ధరకు లభిస్తోంది. దీంతో విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మరో రెండు రోజుల్లో ఇంకో లక్ష టన్నులు వచ్చే అవకాశం ఉండటంతో.. ఏం చేయాలో తెలీక.. అటు ట్రేడర్స్, ఇటు పోర్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. – సాక్షి, విశాఖపట్నం



విశాఖపట్నం పోర్టులో పేరుకుపోయిన బొగ్గు నిల్వలు

- విదేశాల నుంచి వచ్చిన బొగ్గును కొనుగోలు చేయని సంస్థలు
- దేశీయ బొగ్గుతో పోలిస్తే ధర దాదాపు రెట్టింపు ఉండటమే కారణం
- ఇప్పటికే 1.4 మిలియన్ టన్నుల నిల్వ
- రెండు రోజుల్లో లక్ష టన్నులతో రెండు కార్గో షిప్స్ వచ్చే అవకాశం

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర సంస్థలకు అవసరమైన థర్మల్, కోకింగ్, స్టీమ్ కోల్‌ని విశాఖపట్నం ట్రస్టు హ్యాండ్లింగ్ చేస్తుంటుంది. ఏటా సుమారు 2 మిలియన్ టన్నుల థర్మల్, 7 మిలియన్ టన్నుల కోకింగ్, 10 మిలియన్ టన్నుల స్టీమ్ కోల్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు జరుగుతుంటాయి. మొత్తంగా పోర్టు కార్గో హ్యాండ్లింగ్‌లో కోల్ వాటా దాదాపు 25 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. విశాఖకు చెందిన కొందరు వెండర్స్.. ఇక్కడ అవసరాలకు అనుగుణంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటారు. వాటిని పోర్టులో హ్యాండ్లింగ్ చేసి.. ఆయా పరిశ్రమల డిమాండ్ మేరకు విక్రయిస్తుంటారు. అయితే కొద్ది నెలలుగా పోర్టులో కోల్ నిల్వలు అమాంతం పెరిగిపోతున్నాయి.

దేశీయ బొగ్గే మేలని..

ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, చైనా దేశాల నుంచి పోర్టుకు స్టీమ్ కోల్ దిగుమతి అవుతుంటుంది. ఇందులో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా నుంచి వస్తున్న బొగ్గు అత్యంత నాణ్యమైంది కావడంతో దానికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. విశాఖ, ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది ట్రేడర్స్ వీటిని ఆయా దేశాల్లో కొనుగోలు చేసి.. ఇక్కడి తీసుకొస్తుంటారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్టీమ్ కోల్ ధర పెరిగింది. దీంతో ఇండోనేషియా, దక్షిణాఫ్రికా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కోల్ ధర విశాఖ పోర్టుకి చేరుకునే సరికి టన్నును రూ.9000 నుంచి రూ.9500 వరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కోల్ ఇండియా సంస్థ నేరుగా విక్రయాలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్డర్ పెడితే.. కోల్ ఇండియా సంస్థే స్టీమ్ కోల్‌ను తీసుకొస్తోంది. దీంతో దేశీయ బొగ్గు టన్ను ధర విశాఖ చేరే సమయానికి రూ.5,200 నుంచి రూ.5,800 వరకు పలుకుతోంది. విదేశీ బొగ్గు ధరతో పోలిస్తే దాదాపు రూ.4000 వరకు తక్కువ. ఈ పరిస్థితుల్లో బొగ్గు అవసరమైన సంస్థలు దేశీయ బొగ్గు కొనుగోలుకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో విదేశాల నుంచి వస్తున్న స్టీమ్ కోల్ నిల్వలు పోర్టులో పేరుకుపోతున్నాయి. ఇతర దేశాల నుంచి కోల్ తీసుకురావాలంటే 3 నుంచి 6 నెలల ముందుగానే ట్రేడర్లు ఆర్డర్లు పెట్టాలి. దానికనుగుణంగా కార్గోషిప్స్ ఇక్కడికి బయలుదేరుతాయి. ఇక్కడ కొనుగోళ్లు జరగకపోతున్నా.. వాటిని ఆపలేని పరిస్థితి నెలకొంది. దీంతో వస్తున్న నౌకల నుంచి కోల్‌ను దిగుమతి చేసి పోర్టులో నిల్వగా ఉంచేస్తున్నారు.

నిండుగా నిల్వలు

ఇప్పటివరకు పోర్టులో 1.4 మిలియన్ టన్నుల ఇంపోర్టెడ్ స్టీమ్ కోల్ నిల్వలు పేరుకుపోయాయి. గత నెల రోజులుగా ట్రేడర్లు ఎవరూ ఆర్డర్లు పెట్టకపోవడంతో ఆయా దేశాల నుంచి బొగ్గు దిగుమతి ఆగిపోయింది. గతంలో పెట్టిన ఆర్డర్ల మేరకు రెండు నౌకల నుంచి దాదాపు లక్ష టన్నుల స్టీమ్ కోల్‌తో ఈ వారంలో పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే పోర్టంతా బొగ్గుమయం అయిపోగా.. ఇప్పుడు వస్తున్న షిప్స్ నుంచి ఎలా దిగుమతి చేసుకోవాలి. ఎక్కడ.. ఎన్ని రోజులు నిల్వ ఉంచాలంటూ అటు ట్రేడర్లు, ఇటు పోర్టు అధికారులు ఆలోచిస్తున్నారు.

ఆధ్యాత్మికత వారధి.. టీటీడీ డైరీ

- నగరంలో ఏటా పెరుగుతున్న విక్రయాలు
- ఈ ఏడాది అందుబాటులో 20 వేల డైరీలు
- టీటీడీ మేనేజర్ హైమావతి


డైరీని ప్రదర్శిస్తున్న హైమావతి, క్యాలెండర్

ఎంవీపీ కాలనీ : ఆధ్యాత్మికతకు, హిందూ సంప్రదాయానికి వారధిగా తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలు నిలుస్తున్నాయి. గతంలో కేవలం టీటీడీ సిబ్బందికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ డైరీలు ప్రజల్లో పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది డైరీలు సకాలంలో రావడంతో నగరంలో భక్తులు, ఆధ్యాత్మిక, సాహితీ ప్రియుల నుంచి సర్వత్రా ఆనందం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో టీటీడీ డైరీల విశిష్టతను ఆ సంస్థ విశాఖ మేనేజర్ హైమావతి వివరించారు.

ఇప్పటి వరకు 19 వేలు విక్రయించాం..

టీటీడీ డైరీలకు విశేష ఆదరణ పెరుగుతుంది. భక్తులతోపాటు సాహితీప్రియులు వీటి కోసం పోటీ పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 19 వేల డైరీలను విక్రయించాం. మరికొన్ని రోజులు విక్రయాలు జరగనున్నాయి. డైరీలతో పాటు క్యాలెండర్స్, పంచాంగం క్యాలెండర్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో కూడిన పంచాంగం క్యాలెండర్స్ విక్రయిస్తున్నాం. వీటిని **ఆన్‌లైన్‌లో** ద్వారా కూడా కొనుగోలు చేసే అవ**కాశం ఉంది.**

టీటీడీ చరిత్ర కూడా..

ఈ డైరీల్లో కేవలం ఆధ్యాత్మిక సమాచారమే కాకుండా తిరుమల వేంకటేశ్వరస్వామి విశిష్టత, చరిత్రను తెలియజేసే విలువైన సమాచారాన్ని పొందుపరిచారు. తిరుమల ఆలయం ఏర్పాటు నుంచి నేటి వరకు వివిధ దశలను తెలియజేస్తూ అనేక చిత్రాలు, చారిత్రక ప్రాధాన్యమున్న అనేక విషయాలను ఈ డైరీలో ఉన్నాయి. దేవస్థానం వివరాలతో పాటు తిరుమలలో సౌకర్యాలు, తిరుమలకు ఎలా చేరుకోవాలి అనే విషయాలను సమగ్రంగా తెలియజేశారు. దీంతోపాటు బ్రహ్మోత్సవం వివరాలు, గోసంరక్షణ, వేద పాఠశాలలు తదితర వివరాలు ఉన్నాయి.

రికార్డు కోసం.. సాధన చేసి..


ఆసనాలు వేస్తున్న యోగాభ్యాసకులు (ఇన్‌సెట్) యోగా గురువు రమేష్

- యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కోసం ఓం శ్రీ యోగా సంస్థ ప్రయత్నం
- 9న మెయిన్ ఈవెంట్

సీతమ్మధార: విభిన్న రంగాల్లో రికార్డులతో ఖ్యాతిగాంచిన విశాఖ నగరం సరికొత్త రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. 230 మంది సాధకులు, 216 రౌండ్ల సూర్య నమస్కారాలతో.. యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కోసం 'ఓం శ్రీ యోగా సంస్థ' దరఖాస్తు చేసింది. ఇందులో భాగంగా సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం డెమో నిర్వహించింది. ఉదయం ఐదు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రెండు గంటల పాటు సాగింది. యోగాభ్యాసకులు 216 రౌండ్స్‌లో 2,592 సార్లు సూర్య నమస్కారాలు చేశారు. మరో 50 మంది 108 రౌండ్లలో సూర్య నమస్కారాలు చేసినట్లు ఓం శ్రీ యోగా సంస్థ ఫౌండర్ చైర్మన్ చిలక వెంకట రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల యోగాభ్యాసకులు హాజరైనట్లు వెల్లడించారు. జనవరి 9న గాదిరాజు ప్యాలెస్ వేదికగా ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్య కోసం తమ సంస్థ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి రోజూ ఉదయం ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 93333 33344ను సంప్రదించాలని కోరారు.

శీతాకాలపు అతిథులు



చలికాలంలో వెచ్చదనం కోసం ఉన్ని దుస్తులు వాడతాం. రకరకాల సైజులు, రంగురంగుల్లో అందంగా కనిపించే ఈ దుస్తులు వెచ్చని నేస్తాలుగా చలి నుంచి రక్షణనిస్తాయి. అయితే నాణ్యమైన, మన్నికైన ఉన్ని దుస్తులు కావాలంటే మనం తప్పకుండా టిబెటియన్లను ఆశ్రయించాల్సిందే.. ఏడాదిలో నాలుగు నెలల పాటు విశాఖకు అతిథులుగా విచ్చేస్తూ.. మన మనసు దోచే ఉన్ని వస్త్రాలను తమతో పాటు తీసుకొస్తుంటారు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, నెక్ మఫ్లర్లు, ఇయర్ (చెవి) కవర్లు, షాల్స్.. ఇలా ఒకటేమిటి.. చలిగాలుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి ఎటువంటి రక్షణ చర్యలు అవసరమో.. అందుకు అనుగుణమైన వస్త్ర కలెక్షన్ వీరి వద్ద లభిస్తుంది.

– విశాఖపట్నం డెస్క్



- పోలీస్ బ్యారెక్స్‌లో టిబెట్ శరణార్థుల మార్కెట్
- వారి ఉన్ని దుస్తులకు చక్కని గిరాకీ
- అక్టోబర్ నుంచి జనవరి వరకు సీజనల్ వ్యాపారం
- ఆదరిస్తున్న విశాఖ వాసులు

ఉన్ని దుస్తుల విక్రయాలకు అక్టోబర్ నుంచి జనవరి వరకు మంచి సీజన్. అందుకే చలి ప్రారంభం కాగానే టిబెటన్ శరణార్థులు తాము నివసించే ప్రాంతాల నుంచి విశాఖ చేరుకుంటారు. పోలీస్ బ్యారెక్స్ వద్ద నాలుగు నెలల పాటు ఉన్ని దుస్తులు విక్రయిస్తారు. ప్రస్తుత సీజన్‌లో అయిదారు టిబెటన్ శరణార్థ కుటుంబాలు, సహాయకులుగా వారికి సమీప ప్రాంతాలకు చెందిన భారతీయులు విశాఖ వచ్చారు. వన్‌టౌన్‌లోని స్ప్రింగ్ రోడ్డు, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు.

టిబెటియన్ల వద్ద కొనుగోలు చేసే వస్త్రాలను బయట కొనే వాటితో పోలిస్తే మన్నిక విషయంలో చాలా తేడా గమనించవచ్చు. వారి వద్ద ఖరీదు చేసినవి మృదువుగా, ఒంటికి అనువుగా ఉంటాయి. దీనికి కారణం ముడి సరకు. తాము విక్రయించే ఉన్ని దుస్తులను టిబెట్‌లో లభించే ముడి సరుకుతోనే రూపొందిస్తామని చెబుతున్నారు. స్వెటర్లు రూ.200 నుంచి, మంకీ క్యాప్‌లు రూ.100, నెక్ మఫ్లర్లు రూ.75, ఇయర్ (చెవి) కవర్లు రూ. 50కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ ధర వెచ్చిస్తే మరింత మన్నికైన రకాలు కూడా తమ వద్ద లభిస్తాయని వారంటున్నారు.

తాతల కాలం నుంచీ ఇక్కడే..

సుమారు 60 ఏళ్ల కింద వారి తాతల కాలం నాడే టిబెట్‌లోని లాసా, సిగటిస్, చాందో, నించీ, షన్నన్ వంటి ప్రాంతాల నుంచి చాలా కుటుంబాలు భారత్‌కి వలస వచ్చాయి. టిబెట్‌ను చైనా ఆక్రమించడంతో చెలరేగిన కల్లోలం వల్ల తమ పూర్వీకులు ఇండియాకి వలస వచ్చినట్లు టిబెటన్ శరణార్థులు చెప్పారు. అలా వలస వచ్చిన కుటుంబాల్లో కొన్ని మన దేశంలోని సిమ్లా, ఒడిశా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడినట్లు వివరించారు.

అక్కున చేర్చుకున్న భారత్

శరణార్థులుగా మన దేశానికి వచ్చిన టిబెటన్ కుటుంబాలను శతాబ్దాల కిందటే మన ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. శరణార్థుల కేటగిరీ కింద వారికి నివాస యోగ్యత కల్పించింది. ప్రభుత్వ విభాగాల్లో వారికి ఉద్యోగాలు ఇచ్చింది. దీంతో చాలా మంది టిబెటియన్లు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు పొందారు. మిగిలిన వారు స్థానికంగా తోచిన ఉద్యోగాలు చేస్తూ, ప్రభుత్వం అందజేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ మనతో మమేకం అయ్యారు. టిబెటియన్ల పిల్లల విద్యకు కూడా భారత ప్రభుత్వం చక్కని ఏర్పాట్లు చేసింది. ఇప్పుడు చాలా మంది టిబెటన్ శరణార్థుల పిల్లలు తమ అభిరుచి మేర విద్యనభ్యసిస్తున్నారు. ఆడపిల్లల్లో ఎక్కువ మంది నర్సింగ్ విద్య వైపు మళ్లారు.

కుటుంబానిదంతా ఒకటే మాట..

మన దేశానికి వలస వచ్చిన టిబెటన్ శరణార్థులు ఒకే మాటపై ఉంటారు. అంతా కలిసికట్టుగా వ్యాపారం సాగిస్తారు. దలైలామాను పూజించే వీరు క్రమపద్ధతిలో జీవిస్తారు. హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడే వీరు తెలుగు భాష కూడా చక్కగానే అర్థం చేసుకోగలరు. ఆలూ సబ్జీ, పరోటా, రోటీ వంటి ఆహారం తీసుకుంటారు. బయట ఆహారం పట్ల మక్కువ చూపరు. తెల్లవారుజామునే నిద్రలేచి అన్ని పనులు ముగించుకుని ఉదయం 9 గంటలు కల్లా షాపులు తెరిచి విక్రయాలు ప్రారంభిస్తారు. రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు సాగించి షాపులు మూసేసి వెళ్లిపోతారు.



ఇక్కడ ప్రజలు మంచివారు

మా తాత తాషీ.. కుటుంబ సమేతంగా సుమారు 60 ఏళ్ల క్రితం టిబెట్ నుంచి ఒడిశాకు వలస వచ్చారు. నేను ఇండియన్ ఆర్మీలో పని చేసి పదవీ విరమణ చేశాను. నాకు ఇద్దరు పిల్లలు. బాబు 7, పాప 5వ తరగతి చదువుతున్నారు. సీజన్‌లో వ్యాపారం పూర్తయ్యాక ఒడిశా వెళ్లి వ్యవసాయం చేసుకుంటాను. ఇక్కడి అధికారులు, ప్రజలు మంచి వారు. వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నా

– టెంజెన్, ఉన్ని దుస్తుల వ్యాపారి



గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే..

మా కుటుంబం టిబెట్ నుంచి సిమ్లాకు వలస వచ్చేసింది. ఆ సమయంలో నా తల్లి నిండు గర్భిణి. నేను గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే మా కుటుంబం టిబెట్‌ను వీడింది. నేను 28 ఏళ్లుగా ఇక్కడ ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నాను. నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె నర్సింగ్ విద్యనభ్యసిస్తోంది. నేను 16 ఏళ్లు ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాను. సీజన్‌లో విశాఖలో ఉన్ని దుస్తుల వ్యాపారం చేస్తాను. ఇక్కడి వాతావరణం బాగుంది. ప్రజలు మమల్ని ఆదరిస్తున్నారు.

– తాషీ, ఉన్ని దుస్తుల వ్యాపారి



చక్కటి పరిసరాలు.. మంచి వాతావరణం

విశాఖ చాలా బాగుంది. ఇప్పుడు నా వయసు 55 ఏళ్లు. నేను 23 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాను. నాకు ఆరుగురు సంతానం. ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్లు. మగపిల్లలు వ్యవసాయం, ఆడపిల్లలు నర్సింగ్ విద్యనభ్యసిస్తున్నారు. నేను మూడేళ్ల నుంచి ఇక్కడ ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నాను. 60 ఏళ్ల కిందటే మా కుటుంబం ఒడిశాకు వలస వచ్చేసింది. పూర్ణామార్కెట్‌లో ప్రస్తుతం అద్దెకు ఉంటున్నాను. అక్టోబర్ నుంచి జనవరి వరకు ఉన్ని దుస్తుల వ్యాపారం చేసి, సీజన్ ముగియగానే ఒడిశా వెళ్లిపోతాను.

– సామ్‌చుంగ్, ఉన్ని దుస్తుల వ్యాపారి

రోటరీ కప్ గోల్ఫ్ విజేత శ్రీనివాస్


విజేతగా నిలిచిన శ్రీనివాస్


లాంగెస్ట్ డ్రైవ్ హిట్టర్ రామరాజు

విశాఖ స్పోర్ట్స్: రోటరీ గోల్ఫ్ కప్ విన్నర్‌గా కె.శ్రీనివాస్ (33 పాయింట్లతో) ఓవరాల్ నిలిచాడు. 228 యార్డ్స్ హిట్‌తో కె.వి.ఎస్.రామరాజు లాంగెస్ట్ డ్రైవ్ చేయగా 2.7 ఫీట్‌తో క్లోజెస్ట్ పిన్‌గా ఎం.రఘురామ్ నిలిచాడు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఈపీజీసీ ఆదివారం గోల్ఫ్‌కోర్స్‌లో నిర్వహించిన పోటీల్లో 108 గోల్ఫర్లు పోటీపడ్డారు. గోల్డ్ డివిజన్‌లో కెప్టెన్ హేమంత్‌కుమార్ విజేతగా నిలవగా కె.ఎస్.ఆర్.కె.రాజు రన్నరప్‌గా నిలిచారు. సిల్వర్ డివిజన్‌లో కృష్ణకుమార్ సింగ్ విజేతగా వి.అమర్‌కాంత్ రన్నరప్‌గా నిలిచారు. ఎస్.అప్పారావు, టి.కె.రాజు ఈ విభాగాల్లో చక్కటి ప్రతిభ చూపారు. బ్రాంజ్ డివిజన్ విజేతగా ప్రణవ్ చందల్, రన్నరప్‌గా కిరీట్ వెంకట్ నిలిచారు. సీనియర్ డివిజన్ విన్నర్‌గా ఎం.బి.పాత్రుడు, రన్నరప్‌గా జి.ఆర్.జి.రెడ్డి నిలవగా మహిళల విభాగంలో ఎం.సరిత విజేతగా, ఎం.పావని రన్నరప్‌గా నిలిచారు. పోలియో నిర్మూలన ఫండింగ్ కోసం ఈ పోటీలు నిర్వహించగా వచ్చిన ఐదు లక్షల చెక్కును వినియోగించనున్నారు. విజేతలకు సంధ్యమెరైన్స్ ఎండీ కె.వి.ప్రసాద్ జ్ఞాపికలు అందించారు. రోటరీ జిల్లా గవర్నర్ వెంకటసుబ్బారావు, డైకిన్ కిషోర్‌కుమార్, మధుబాబు, ఈపిజిసి ఎంఎస్ఎన్ రాజు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి బ్రహ్మానందం,నేతాజీ, శంకర్,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–బల్హార్షా సెక్షన్ హసన్‌పర్తి రోడ్–ఉప్పల్ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

ఈ కింది రైళ్లు దువ్వాడ–విజయవాడ–వరంగల్–బల్హార్షా మీదుగా కాకుండా మళ్లించిన మార్గంలో వయా విజయనగరం–రాయగడ– టిట్లాఘడ్– రాయ్‌పూర్– నాగ్‌పూర్ మీదుగా నడుస్తాయి.

- జనవరి 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం–న్యూఢిల్లీ –విశాఖపట్నం (20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్
- జనవరి 4, 11 తేదీల్లో విశాఖపట్నం–గాంధీదాం(20803) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న గాంధీదాం–విశాఖపట్నం (20804) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 1, 5, 8, 12 తేదీల్లో విశాఖపట్నం –హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3, 7, 10 తేదీల్లో హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 7న పూరీ –ఓఖా(20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్
- జనవరి 3,10 తేదీలలో ఓఖా–పూరీ (20820) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు.

కోరాపుట్–రాయగడ్ లైన్‌లో..

వాల్తేర్ డివిజన్ దమన్‌జోడి–బాయ్‌గుడ స్టేషన్‌ల మధ్య జరుగుతున్న రెండో లైన్ సంబంధిత పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. జనవరి 1,5 తేదీల్లో విశాఖపట్నం–కోరాపుట్(18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, జనవరి 2,6 తేదీల్లో కోరాపుట్–విశాఖపట్నం (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

'పుంగనూరు చరిత్ర–నాతో నేను' పుస్తకావిష్కరణ


పుంగనూరు చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ లజపతిరాయ్, సాహితీవేత్త సూర్యారావు, డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత

డాబాగార్డెన్స్: చరిత్రతోనే రెండు ప్రాంతాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ప్రొఫెసర్ లజపతిరాయ్ అన్నారు. డాక్టర్ ఎం రామచంద్రారెడ్డి రచించిన 'పుంగనూరు చరిత్ర–నాతో నేను' పుస్తకావిష్కరణ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. రచయిత, సాహితీవేత్త సూర్యారావు, డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి, డాక్టర్ లక్ష్మీ సంగీత దంపతులతో కలిసి ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని కళలు, పర్యాటకం, ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ ఓ పుస్తకం తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ రామచంద్రారెడ్డి 90 ఏళ్ల వయసులో ఎంతో కష్టపడి పుంగనూరు చరిత్రను రచించారని, మిగిలిన ప్రాంతాలకు పుంగనూరు చరిత్ర తెలియజేయాలన్న అతని తనయుడు చైతన్యరెడ్డి ఆకాంక్ష అభినందనీయమన్నారు. పుంగనూరుకు గొప్ప చరిత్ర ఉందని, ఆలయాల పట్టణం అని కూడా పిలవవచ్చని తెలిపారు. డాక్టర్ చైతన్యరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాఖపట్నంకు ఓ చరిత్ర ఉందన్నారు. తాను విశాఖలోనే వివాహం చేసుకున్నానని, మెడికల్ పీజీ ఇక్కడే చేశానని చెప్పారు. 1976లో మెడిసిన్ పూర్తి చేసిన తన తండ్రి రామచంద్రారెడ్డి ఎన్నో పుస్తకాలు రాసినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రచురణ కాలేదన్నారు. శ్రీశ్రీ రాసిన పుస్తకంలో తన తండ్రి రాసిన కవిత ఉందన్నారు. ఈ పుస్తకం రాసేందుకు ఆయనకు రెండేళ్లు పట్టిందని.. సమాజంలో రుగ్మతలు, డాక్టర్‌గా అందించిన సేవలతో పాటు పుంగనూరు విశేషాలన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచారని చెప్పారు. సాహితీవేత్త సూర్యారావు మాట్లాడుతూ ప్రాంతీయ పోరాటాల యుగమిదని, ఒక ప్రాంత చరిత్ర మిగిలిన ప్రాంతాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

మహిళ మృతి, ఐదుగురికి గాయాలు


దెబ్బతిన్న ఆటో


నమ్మి సూరమ్మ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో పోర్టు రోడ్డులో మారుతీ జంక్షన్–షీలానగర్ మధ్య ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ సయ్యద్ యూసఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓం శక్తి మాలధారణ చేపట్టిన పెదగంట్యాడ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు చెన్నైలోని ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. చెన్నై నుంచి ఆదివారం ఉదయం విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పెదగంట్యాడ ప్రాంతం సీతానగరానికి వచ్చేందుకు రైల్వేస్టేషన్‌లో రెండు ఆటోల్లో ఎక్కారు. పోర్టు రోడ్డులో మారుతీ జంక్షన్ దాటి షీలానగర్ వైపు వస్తుండగా అక్కడ పార్కింగ్ చేసి ఉన్న గ్యాస్ ట్యాంకర్ లారీని ఓ ఆటో ఢీకొంది. ఆటోలో ముందు (డ్రైవర్ పక్కన) కూర్చున్న నమ్మి సూరమ్మ (63) తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. కంచరపాలెంకు చెందిన ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న గొలగాని కుంచమ్మ, యలమంచిలి సోమేశ్వరి, మొల్లి వెంకటలక్ష్మి, రమ, మృతురాలి మనుమరాలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో కేజీహెచ్‌కు తరలించారు. స్వల్ప గాయాలపాలైన వారు కేజీహెచ్‌లో చికిత్సలు పొంది స్వగృహాలకు వెళ్లిపోయారు. సూరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త దాలిబాబు స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి కాగా ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ సయ్యద్ యూసఫ్ తెలిపారు.